క్లుప్తంగా

వావిళ్లలో నేత్రదానం

విడవలూరు : మండలంలోని వావిళ్ల గ్రామంలో మాజీ ఎంపీపీ తుళ్లూరు గోపాలయ్య పిన్నమ్మ నారాయణమ్మ(75) శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో ఆమె స్వగృహంలో మరణించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మాడరన్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు, నాగేశ్వరరావు ఆమె నేత్రాలను సేకరించారు.

అధికారుల్లేని సర్వసభ్య సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే అధికారులెవరూ సమావేశానికి రాకపోవడంతో తూతూమంత్రంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత విడుదలయ్యాయో చెప్పాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓను ప్రశ్నించారు. అధికారులు సమావేశానికి హాజరు కాకపోతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని, ప్రజల సమస్యలను చర్చించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు ముందుగా వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేసి పూజ నిర్వహించారు. కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

విడవలూరు : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని వైద్యాధికారి అమరేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని వావిళ్ల ఎస్టీ కాలనీలో రామతీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఎస్టీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలకు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు చేపట్టారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రంలోని బాలింతలు, గర్భిణులకు అందించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్ఎస్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మదేవి భూముల కౌలు వేలం వాయిదా

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి గ్రామంలో ఉన్న కైలాసనాథేశ్వరాలయానికి చెందిన భూముల కౌలువేలం పాట వాయిదా పడింది. ఈ ఆలయానికి చెందిన సుమారు 57.34 ఎకరాల మాగాణి భూములకు శనివారం సాగు వేలం వేసేందుకు ఈఓ మోహన్‌కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో మూడేళ్లకు ఒక సారి వేలం వేసే పద్ధతి ఉండగా, ఇక నుంచి ఏటా వేలం నిర్వహిస్తామని షరతు పెట్టారు. పైగా గతంలో కంటే ఎక్కువ ధరకు వేలం పాడాలని నిబంధన విధించారు. దీనితో రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గతంలో వేలం పాడి ఈ భూముల్లో సాగు చేయడం వల్ల నష్టం వచ్చిందని, పాత ధరకే వేలం నిర్ణయించాలని రైతులు కోరారు. తక్కువ ధరకు వేలం పాడారు. అయితే, ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో వేలాన్ని వాయిదా వేశారు.

మెళకువలతో కూడిన బోధన అవసరం

కొడవలూరు : తెలుగు, ఆంగ్ల సబ్జెక్ట్‌లో మెళకువలతో కూడిన బోధనా పద్ధతులు అవసరమని ఎంఈఓ ఎస్.అంకయ్య సూచించారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్ల సబ్జెక్ట్‌ల బోధనపై శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తేలా, ఎక్కువ కాలం గుర్తుండేలా బోధన సాగాలన్నారు. శిక్షణా తరగతుల్లో ఆధునిక బోధనా పద్ధతులు, మెళకువలపై నిపుణులు శిక్షణ ఇస్తున్నందున దీనిని సద్వినియోగం చేసుకుని అమలు చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో అమలు చేయాల్సిన విద్యా ప్రవేశిక, బడి బయట పిల్లలు బడిలో చేరిక తదితరాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులకు ఎ.సంధ్య, ఎ.కీర్తన, పి.హరిబాబు రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, సురేష్, శ్రీహరి పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు



రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ

• ప్రైవేట్ వైద్యశాలల బంద్

నెల్లూరు(అర్బన్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో మహిళా ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రులను శనివారం ఉదయం ఆరు నుంచి మూసేశారు. అత్యవసర కేసుల మినహా ఓపీ, సాధారణ సర్జరీలను బంద్ చేశారు. విషయం తెలియక అనేక మంది రోగులు ఆస్పత్రులకు వచ్చి ఇబ్బంది పడ్డారు. ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెస్ రెడ్డి, రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో వైద్య సేవలను బంద్ చేశారు. నిరసన ర్యాలీని డాక్టర్లు సిబ్బంది చేపట్టారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ బిందురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ యశ్వేత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• నారాయణ ఆస్పత్రిలోని డాక్టర్లు, సిబ్బంది ఆస్పత్రి నుంచి వడ్డిపాళెం వరకు ర్యాలీని నిర్వహించారు. వైద్యసేవలను నిలిపేశారు. డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కాంత్, న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్, నెఫ్రాలజీ హెచ్ఓడీ ప్రవీణ్‌కుమార్, కార్డియాలజిస్ట్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పలు అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు జీజీహెచ్‌లో సేవలను నిలిపేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, పీపీ యూనిట్ గైనకాలజిస్టులు ఇందిర, స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.

• గ్రామీణ ప్రాథమిక వైద్యులు ర్యాలీని పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. వెంగళరావు నగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది చేస్తున్న నిరసనలో పాలుపంచుకున్నారు. ఆరోగ్య కేంద్ర డాక్టర్ రీనాభారతి, పీహెచ్‌పీ సంఘ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

• డాక్టర్ల ప్రాణాలను కాపాడాలని నగరంలోని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సీనియర్ డాక్టర్ రమేష్‌బాబు కోరారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో పీజీ చేస్తున్న ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ ఆస్పత్రి నుంచి వీఆర్సీ వరకు భారీ ర్యాలీని డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన ఘటనను అక్కడి ప్రభుత్వం ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చట్టాలను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ శ్రీనునాయక్, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద కొవ్వొత్తులను వెలిగించి సంతాపం తెలియజేశారు. పీహెచ్‌సీల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు విద్యార్థులతో ర్యాలీని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగ నేత తోఫీ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్, ఏఐఎస్ఎఫ్ నేత శివ, ఎస్ఎఫ్ఐ నేతలు ఆషిర్, నవీన్, ఖాదర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..



నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

ప్రశాంతంగా ముగిసిన పర్యటన

నెల్లూరు(క్రైమ్): ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ శనివారం ముగిసింది. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు విధులను నిర్వర్తించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: నగరంలోని 21వ డివిజన్లో గల మాగుంట లేఅవుట్, డీ మార్ట్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శనివారం చేపట్టారు. క్లస్టర్ ఇన్‌చార్జి సాయిబాబా టీడీపీ నేతలు చాంద్‌బాషా, కోటిరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మల్లికార్జున, ప్రకాష్, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోసూరు బాలయ్యగౌడ్, మహేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన గవర్నర్ దంపతులు



నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహ ఆవరణలో మొక్కలను గవర్నర్ అబ్దుల్ నజీర్, సమీరా దంపతులు శనివారం నాటారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, డీఎఫ్ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని నేతలు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవ వేడుకలను జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానంతో పాటు వస్త్రాలను అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు దయాశంకర్, కోశాధికారి గడ్డం హనోక్, సుందరం తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ సీఐగా వేణు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మారుతికృష్ణను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో వేణును సీఐగా నియమించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు కట్టొద్దు

• మంత్రి నారాయణ



హరనాథపురంలో పర్యటిస్తున్న నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో ఆదివారం నుంచి ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను కట్టేందుకు వీల్లేదని, నిర్దేశిత ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. హరనాథపురం సమీపంలోని సర్వేపల్లి కాలువ సమీపంలో శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో 2014 – 19 మధ్య సర్వేపల్లి కాలువపై ఐదు బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించామని, అప్పట్లో మూడింటిని మంజూరు చేశామని తెలిపారు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అంచనాలను రూపొందించి వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కొంచెం వెసులుబాటు రాగానే నెల్లూరులో పెండింగ్‌లో ఉన్న భూగర్భ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని వెల్లడించారు. నగరంలో ఫ్లెక్సీలు కట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారని, ఇవి ఉంటే నగరానికి అందం రాదన్నారు. కేవలం కొన్ని ప్రాంతాల్లోనే పెట్టుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా నిత్యహోమాలు, గోపురోత్సవం తదితరాలను శనివారం జరిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



నెల్లూరు(బృందావనం): మైపాడు రోడ్డులోని వైకుంఠపురంలో గల కాశీనాయన ఆశ్రమంలో కొలువైన దుర్గమ్మకు సారెను భక్తులు సమర్పించారు. అనంతరం పూజలు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్, మహేష్, మురళి, అనిత, పద్మజ, రజని, మీనా, భార్గవి, మీనాక్షి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. కోదండరాముడికి పంచామృతాభిషేకం, లక్ష తులసీదళార్చనను జరిపారు. తదుపరి పూర్ణాహుతిని నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని రాత్రి జరిపారు. ఆంజనేయస్వామికి పల్లకిసేవను నిర్వహించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

• గతేడాది పీడీ యాక్ట్ నమోదు
• జైలుకెళ్లొచ్చినా తీరు మారని వైనం



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలకు పాల్పడుతుండగా, ఆమెపై పోలీసులు పీడీ యాక్ట్‌ను గతేడాది నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకొచ్చినా, ఆమె తీరులో మార్పురాలేదు. యథేచ్ఛగా విక్రయాలకు పాల్పడుతుండగా, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు ఆమెను శనివారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో నిందితురాలి వివరాలను ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. కపాడిపాళెంలోని రాయపువీధికి చెందిన ముంతాజ్ విశాఖ, ఏఓబీ ప్రాంతాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా జిల్లా వ్యాప్తంగా విక్రయాలు సాగిస్తున్నారు. సంతపేట, కలువాయి, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లతో పాటు ఎస్ఈబీ నెల్లూరు – 1, ఆత్మకూరు, కోవూరు స్టేషన్లలో ఆమెపై గంజాయి కేసులున్నాయి. పలు మార్లు ఆమెకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా ఫలితం లేదు. దీంతో గతేడాది పీడీ యాక్ట్‌ను ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. జైలు నుంచి బయటకొచ్చినా తీరులో మార్పురాలేదు. ఈ క్రమంలో స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాల కట్టడికి ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విక్రేతలపై నిఘా ఉంచారు. ముంతాజ్ తన ఇంట్లో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని పక్కా సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి ఆమె ఇంటిపై దాడి చేశారు. అక్కడున్న 16 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్ట్ చేశారు.

బాబోయ్.. పందులు



నజీర్‌తోటలో ఇళ్ల మధ్య సంచరిస్తున్న పందులు

• జనావాసాల్లో తీవ్రమవుతున్న సమస్య
• వ్యాధుల భయంతో ఆందోళనలో ప్రజలు

నెల్లూరు(బారకాసు): నగరంలో పందుల స్వైరవిహారం నానాటికీ అధికమవుతోంది. గతంలో ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో, ఆ సమయంలో వీటిని పట్టి దూర ప్రాంతంలో వదిలేశారు. తర్వాత ఈ అంశాన్నే నగరపాలక సంస్థ అధికారులు విస్మరించారు. ఈ క్రమంలో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. నగరంలో పందుల పెంపకందారులు వీటిని జనావాసాల్లో వదిలేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలోని నజీర్‌తోట, వెంకటేశ్వరపురం టిడ్కో గృహాల సముదాయం, రాజీవ్‌గృహకల్ప, సర్వేపల్లికాలువ తదితర ప్రాంతాల్లో వీటి సంచారం అధికంగా ఉంది. వీటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కాగితాలకే పరిమితమైన షెడ్లు

నగరంలో పందుల సంచారంపై గతంలో ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నగరానికి దూరంగా షెడ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటిని రోడ్లపైకి వదలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే షెడ్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై వదిలితే చర్యలు

నగర, రూరల్ ప్రాంతంలోని తమ ఇంటి పరిసరాల్లో షెడ్లను పెంపకందారులు ఏర్పాటు చేసుకోవాలి. ఈ నిబంధనను అమలు చేసేందుకు గానూ పెంపకందారుల వివరాలను సేకరిస్తున్నాం. రోడ్లపై వదిలిన వారికి నోటీసులను ఇస్తాం. మార్పు రాకపోతే చర్యలు తప్పవు.

- మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, నగరపాలక సంస్థ

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకిసేవ వైభవంగా జరిగింది.